# ఇన్లాండ్ లెటర్ కథలు

## బాపుగారి బుడుగు

అప్పుడు సమయం ఉదయం ఎనిమిది గంటలు కావొస్తోంది. గదిలోని గోడకి ఉన్న కేలెండర్ లోని తేదీ మార్చబోతూ అప్రయత్నంగా అలాగే నిలబడి కేలెండర్ వైపే తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు బోసు. అతని కళ్ళలో ఏదో తెలియని ఆవేదన కొట్టొచ్చినట్లుగా కనబడుతోంది. ఇంతలో కాఫీ కప్పుతో దగ్గరగా వచ్చిన భార్య కృష్ణవేణి పిలువుతో ఊహల నుంచి వాస్తవంలోనికి వచ్చాడు బోసు. 'ఏమిటండి ఇంకా అలాగే ఉన్నారు? తయారు కాలేదేం? ఈరోజు నన్ను డెలివరికి తీసుకెళ్లడానికి ఊరినుంచి మా అమ్మా నాన్న వస్తున్న విషయం మర్చిపోయారా' అన్న భార్య మాటలకు "ఆ అది అది" అంటూ బాధ నిండిన స్వరంతో సన్నగా నసిగాడు బోసు. " ఏమిటండీ మీ నస రెండు రోజులనుంచీ గమనిస్తున్నాను నేను మిమ్మల్ని, చాలా మూడీగా ఉంటున్నారు" అంది భార్య కృష్ణవేణి అసలు విషయాన్ని బయటకు రాబట్టాలన్న కుతూహలంతో. "కృష్ణా అది ఏమి లేదురా" అంటూ మళ్లీ గద్గదమైన స్వరంతో సన్నగా మూలిగాడు బోసు. అప్రయత్నం



గానే అతని కళ్ల వెంట జల జల కారుచున్న కన్నీటిని తన చీర చెంగుతో తుడిచి అతనిని తన దగ్గరగా తీసుకుని, అతడి బాధలో తనూ పాలు పంచుకుని, అతడిని సముదాయించాలని ప్రయత్నిస్తోంది భార్య కృష్ణవేణి. అతడు బావురుమని ఏడుస్తూ ఆమెను మరింత అల్లుకుపోయాడు చిన్న పిల్లాడు మారాం చేస్తున్నట్టుగా. "ఏవండి, మీరు మరీ ఇంత సున్నితమైతే ఎలాగండీ, నేను డెలివరీకని వెళ్లి, ఇప్పట్లోరానవేగా మీ బాధంతా, నేనర్థం చేసుకోలేదనుకున్నారా, నేను డెలివరికి రాను, ఇక్కడే ప్రసవిస్తానని మా అమ్మా నాన్నకి నిన్ననే లెటర్ వ్రాసాను, ఈ విషయం మీకు నేనే స్వయంగా చెబుదామని అనుకుంటుండగా ఇంతలోనే మీరు ఇలా " అంటూ కన్నీళ్లు, ప్రేమ కలగలసిన కళ్లతో ఆప్యాయంగా చూసింది భార్య కృష్ణవేణి. ఆ చూపులోని అనంతకోటి ప్రేమాను రాగాలకు చలించిపోయాడు బోసు. ఏవండీ నా దగ్గర మీరు మరీ ఇలా చిన్నపిల్లాడి లాగా గారం చేస్తుంటే అచ్చం ఎలా ఉన్నారో తెలుసా అన్న భార్య మాటకు "ఊ ఎలా ఉన్నాను" అన్నాడు ముద్దు ముద్దుగా బోసు.

"అచ్చం బాపుగారి బొమ్మ బుడుగు లా ఉన్నారు" అంది భార్య కృష్ణవేణి భర్తవంక చిలిపిగా చూస్తూ. "అవును నేను బుడుగునే" అంటూ నోట్లో వ్రేలు పెట్టుకుని భార్య వంక కొంటెగా చూసాడు బోసు. చిన్నపిల్లాడిలా నోట్లో వ్రేలు పెట్టుకున్న భర్తవంక చూసి పకపకా నవ్వింది భార్య కృష్ణవేణి. భార్య నవ్వులో తనూ శృతి కలిపాడు బోసు.

కణితి శ్రీవాణి.

## భంగపాటు

గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు వేగం పుంజుకుంది. రాత్రి పది దాటింది. జనం నిద్రలోకి జారుకున్నారు.

ప్రతాప్‌కి నిద్ర రావడంలేదు. పై బెర్తుమీద పరచిన తువ్వాలు మీద నాలుగైదు పత్రికలు మేం ఉన్నాం అంటున్నాయి. క్రింద బెర్తు మీద ఏదో పత్రిక తిరిగేస్తున్న పడుచు పిల్ల కనబడింది. పదే పదే ఆ పిల్లను చూశాక ప్రతాప్‌కి చిలిపి కోరిక కల్గింది. ఆ ప్రయత్నంలో తొలి యత్నంగా తన చేతిలోని పత్రిక ఆవిడ ముందు పడేట్టు జార విడిచాడు.

ఆవిడ పైకి చూసింది. ఆ చూపులు అమాయకంగా ఉన్నాయి. "సారీ అండి" అంటూ చేయి చాచాడు. ఆవిడ పత్రిక అందించింది.

ఐదు నిమిషాలు కష్టంగా గడిచాయి. అతడు మరో పత్రిక జార విడిచాడు. ఆవిడ చూచింది. అతడు సారీ అన్నాడు. పత్రిక అందించింది.

మరో పది నిమిషాలు మరింత కష్టంగా గడిచాయి. ఇంకో పత్రిక జారిపడింది. సారీ అనడం...అందుకోవడం... అయిపోయాయి.

ప్రతాప్‌కి ఆమె కంఠస్వరం వినాలన్నా తలంపుతో అన్ని పత్రికలు జారవిడిచాడు. అందులోంచి ఓ పత్రిక దిశమారిపోయి ఆ పక్కనే పడుకున్న ఆ పిల్ల చెల్లిమీద పడింది. అందాక దొంగచూపుల్తో అదంతా ఓ కంట కనిపెడ్తున్న ఆ పిల్ల లేచింది.

ప్రతాప్ సారీ చెప్పకముందే పత్రికల్ని పైకి ఎత్తి పట్టుకుంది. అతడు వాటికోసం చేయికిందకు సాచాడు. ఆ చిలిపి అమ్మడు గబుక్కున పత్రికలున్న తన ఎడమచేయి కిందికి లాక్కొని తన కుడిచేతిని పైకెత్తింది చెంపమీద వాయిద్దామని. ఆమె చేయి తన చేతిని తాకగానే అతడు ఉలిక్కి పడ్డాడు. దృష్టిని ఆ పిల్లవైపు సారించాడు. ఇందాక తను చూసిన పిల్లకాదు. మరో చిత్రాంగి. ఆ గుడ్డివెలుతురులో చింతనిప్పుల్లా ఆవిడ కళ్లు మెరుస్తున్నట్లు కనిపించాయి. చెప్పుతో కొట్టినట్టనిపించింది.

"సారీ" అంది కంగుమంటున్న కంఠంతో. ప్రతాప్‌లో యిందాకటి కోరిక లేదు. వెంటనే నీరసం ఆపైన భయం చోటు చేసుకుంది. ఆ పిల్లను



పలకరించే ధైర్యంలేక పత్రికల్ని వదిలేసి బెర్తుమీద వాలిపోయాడు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

తెలతెలవారుతుంటే రైలు అన్నవరం చేరింది. ప్రతాప్ కళ్లు తెరిచాడు. రాత్రి విషయాలు గుర్తుకొచ్చాయి. గుండెలు చిక్కబట్టుకుని కింది బెర్తులకేసి చూచాడు. అక్కడ ఆ పడుచులు లేరు! పత్రికలూ లేవు!

వి.పద్మావతి.